

చౌడేపల్లె హైస్కూల్లో పురుగులన్నం!



చౌడేపల్లె, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : చౌడేపల్లె మండలంలోని పుదిపట్ల హైస్కూల్‌లో విద్యార్థులకు వడ్డించిన మధ్యాహ్న భోజనంలో పురుగులు దర్శనమిచ్చిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థుల తల్లితండ్రుల కథనం మేరకు.... పుదిపట్ల హైస్కూల్‌లో 375మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. సోమవారం వడ్డించిన మధ్యాహ్న భోజనంలో పురుగులను గుర్తించిన విద్యార్థులు పక్కన పడేశారు. ఆ తరువాత ఉపాధ్యాయులు ఆ అన్నం మొత్తం పడేసి తిరిగి వండించి పెట్టారు. ఆ అన్నంలో ముక్క పురుగులు కన్పించడంతో విద్యార్థులు వారివారి తల్లితండ్రులకు చెప్పారు.పేరంట్స్ కమిటీ చైర్మన్ మనోహర్‌రెడ్డి సభ్యులతో కలసి మంగళవారం మిడ్డేమిల్స్‌లో పురుగుల విషయాన్ని హెచ్‌ఎం పద్మజ దృష్టికి తీసుకువెళ్ళారు. ఇకనైనా పురుగులు లేకుండా చూడాలని కోరారు.మరోవైపు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలకు ఇంటినుంచే భోజనం పంపిస్తున్నారు. ఈ విషయంపై ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మలను వివరణ కోరగా ఇప్పుడు వచ్చిన బియ్యం బస్తాల్లో తెల్లపురుగులున్నాయని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళనున్నట్లు తెలిపారు. అయితే బియ్యాన్ని శుభ్రపరిచి వండకపోవడం మిడ్డే మీల్స్ నిర్వహకుల తప్పేనని, ఇకపై ఇలాంటి పొరబాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మీ పిల్లలకైతే ఈ భోజనమే పెడతారా...?

ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి ఆగ్రహం

పూతలపట్టు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): 'మీ ఇంట్లో పిల్లలకైతే ఇలాంటి భోజనమే పెడతారా...? పసిపిల్లలకోసం చేసే పప్పును కూడా బొక్కేస్తారా..? పిల్లలకు కడుపునిండా భోజనం పెట్టకపోతే సహించేది లేదు' అంటూ ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమల దేవి హెచ్చరించారు.పూతలపట్టు ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం వడ్డిస్తున్న భోజనాన్ని ఆమె తనిఖీ చేశారు. పిల్లలతో కలిసి భోంచేశారు. 15 కిలోల పప్పుతో చేయాల్సిన సాంబారును 10 కిలోల పప్పుతో పలచగా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రుచిలేని నీళ్ల సాంబారుతో పిల్లలు ఎలా భోంచేయాలని ప్రశ్నించారు. విద్యార్థులు రెండోసారి భోజనం కోసం వస్తే వడ్డించేవారు మందలించడంపై ఆమె మండిపడ్డారు. ఎన్నిసార్లు భోజనం కోసం వచ్చినా పెట్టాలని సూచించారు. మధ్యాహ్న భోజనం ఇన్‌చార్జిగా ఉన్న ఉపాధ్యాయుడిపై అసహనం వ్యక్తం చేశారు. అంతకుమునుపు ఆమె స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. నాణ్యమైన పౌష్టికాహారాన్ని పిల్లలకు అందించాలని కోరారు.



విద్యార్థులతో కలిసి భోంచేస్తున్న దేవి

భారీ వర్షంతో జనజీవనం అస్తవ్యస్తం



ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వర్షం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో బుధవారం సాయంత్రం చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం భారీగా మారి నగర జీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. నగరపాలక పరిధిలోని ముత్తిరేవుల నుంచి సీఎంసీ ఆస్పత్రి వరకూ, ఎస్టేట్ ఠాణా నుంచి కుక్కల పల్లె వరకు రహదారుల్లో వర్షపునీరు ప్రవహించడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.పలమనేరు రోడ్డులోని రసూల్ బాబా దర్గాలో నిర్వహించిన ఉరుసు , టీటీడీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్త కళా ప్రదర్శన వర్షం కారణంగా జనాల్లేక వెలవెల బోయాయి.లోతట్టు ప్రాంతాలైన నీవానది పరివాహక ప్రాంతం, రంగాచారి వీధి, సంతపేట ఇందిరా నగర్, కోర్టు హరిజనవాడ, కట్టమంచి హరిజనవాడ, కాజూరు, ఇరువారం ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.





ఎంఎస్ఆర్ సర్కిల్ వద్ద వర్షపు నీటితో ఇబ్బందులు - ఆకాశంలో మెరుపుల మిలమిలలు

జిల్లావ్యాప్తంగా వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా మూడ్రోజులుగా తేలికపాటి నుండి భారీ వర్షాలు జిల్లా అంతటా కురుస్తున్నాయి. ఈ వర్షాలు శుక్రవారం వరకు కొనసాగుతాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విపరీతమైన ఎండకాసిన తర్వాత కారుమబ్బులు కమ్ముకొని, సాయంత్రం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. గడిచిన 24 గంటల్లో 22 మండలాల్లో వర్షం కురవగా, చిత్తూరు రూరల్‌లో అత్యధికంగా 76.2 మిమీ, అత్యల్పంగా పుంగనూరులో 3.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా యాదమరిలో 75.6, పాలసముద్రంలో 65.8, గంగవరంలో 58.4, చిత్తూరు అర్బన్‌లో 50.2, బంగారుపాళ్యంలో 49.2, గుడిపాలలో 45.4, పలమనేరులో 29.4, తవణంపల్లెలో 24.6, రొంపిచెర్లలో 17.6, పులిచెర్లలో 15.2, గంగాధరనెల్లూరులో 15.0, నదుంలో 14.2, సోమల, శ్రీరంగరాజపురం మండలాల్లో 10.4, చౌడేపల్లెలో 10.2, రామకుప్పం, పెద్దపంజాణి మండలాల్లో 6.4, శాంతిపురంలో 5.4, ఐరాలలో 5.2, వి.కోటలో 4.4 మిమీ వర్షం కురిసింది.

జెండా పండుగకు అతిథిగా మంత్రి సత్యకుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15న చిత్తూరులో జరిగే స్వాతంత్ర్య దినోత్సవాలకు అతిథిగా మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరు కానున్నారు.జాతీయ జెండాను ఎగురవేసి సందేశం ఇచ్చేందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీచేశారు.

వి.రామాపురంలో చిరుత కలకలం



పొలంలో కనిపించిన అడుగులు

గంగవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండలంలోని వి.రామాపురంలో చిరుతపులి కలకలం గ్రామస్తులను తీవ్ర భయాందోళనకు గురిచేసింది.బుధవారం వేకువజామున రైతులు గడ్డికోయడానికి వెళ్లగా పొలంలో నుంచి చిరుత పరుగెత్తడం గమనించారు. తరువాత పొలంలో చిరుత అడుగులను గుర్తించారు. ఈ సమాచారంతో గ్రామస్తులందరూ అప్రమత్తమయ్యారు. పొలాల వద్ద ఉన్న పశువులను ఇళ్లవద్దకు తోలుకొచ్చేశారు. అయితే పొలంలో కన్పించినవి అడుగులు చిరుతవా, అడవి పిల్లివా, ఇతర జంతువులవా అన్న విషయం అటవీశాఖ పరిశీలనలో తేలాల్సి ఉంది.

పెండింగ్‌లో రూ.239 కోట్ల పనులా?

● అధికారులపై కలెక్టర్ ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 15వ ఆర్థిక సంఘ నిధుల, జడ్పీ సాధారణ నిధుల వినియోగానికి సంబంధించి పనులు పెండింగ్‌లో ఉండడంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్‌లో రూ.146 కోట్లకు సంబంధించి 204 పనులు, ఆర్‌డబ్ల్యూఎస్‌లో 461 పనులకు సంబంధించి రూ.239.17 కోట్ల పనులు పెండింగ్‌లో ఉండడం దారుణమన్నారు.జడ్పీ సమావేశ మందిరంలో బుధవారం 15వ ఆర్థిక సంఘ నిధుల, జడ్పీ సాధారణ నిధుల వినియోగంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులున్నా పనులు ఆలస్యంగా ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. మరో నెలలో పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి వారం జరిగిన పనులకు సంబంధించిన బిల్లులను, ఇతర వివరాలను తనకు పంపాలని పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలను ఆదేశించారు.వెదురుకుప్పం మండలంలో మౌలిక వసతులకు సంబంధించిన పనుల్లో పురోగతి లేకపోవడంతో పీఆర్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు మండల పీఆర్ ఏఈ, గుడిపాల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, జీడీనెల్లూరు పీఆర్ ఏఈల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాగునీరు. సీసీరోడ్డు, ఇతర మౌలిక వసతుల పనులు ఆలస్యం కారాదని స్పష్టంచేశారు. ఏమైనా సమస్యలుంటే జడ్పీ సీఈవో దృష్టికి తీసుకురావాలని సూచించారు.జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయ్‌కుమార్, ఎంపీడీవోలు, ఏఈలు పాల్గొన్నారు.

ఈ-ఆఫీసు ద్వారానే ఇకపై ఉత్తర ప్రత్యుత్తరాలు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్నిశాఖల హెచ్‌ఓడీలు కచ్చితంగా ఉత్తర ప్రత్యుత్తరాల కోసం కార్యాలయాల్లో ఈ-ఆఫీసు ద్వారానే ఫైళ్లు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వర్చువల్ పద్ధతిలో ఆయన సమీక్షించారు.ప్రతి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఎన్ని ఫైళ్లు పరిష్కరించారు? ఇంకెన్ని పెండింగ్‌లో ఉన్నాయి? తపాలా బట్వాడా ఏవిధంగా నిర్వహిస్తున్నారో వెంటనే ప్రొఫార్మాలో నివేదికల రూపంలో హెచ్‌వోడీలు అందజేయాలని ఆదేశించారు.ప్రతి బుధవారం ప్రత్యేక సమీక్షా సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలకు పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు పీజీఆర్ఎస్ ద్వారా 59,500 వినతులు అందాయన్నారు. కోర్టు కేసులకు సంబంధించిన పిటిషన్లపై వెంటనే కౌంటర్ ఫైల్ దాఖలు చేయాలని సూచించారు. మండల స్పెషలాఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్వాడీలను, ఆస్పత్రులను, పాఠశాలలను, సంక్షేమ వసతిగృహాలను తనిఖీ చేసి సమస్యలను గుర్తించాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు ఏ విధంగా కొనసాగుతున్నాయో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడెల్, డీఆర్వో మోహన్‌కుమార్, డీఎఫ్‌వో భరణి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై సర్కారు కొరడా

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తప్పు చేస్తూ పట్టుబడిన రెవెన్యూ అధికారులపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది.తవణంపల్లె తహసీల్దార్‌గా పనిచేసి రిటైరైన ఓ మహిళా తహసీల్దార్‌తో పాటు ఏడుగురు ఇతర సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.తవణంపల్లె తహసీల్దార్ కార్యాలయంలో 2022వ సంవత్సరం జూన్ 6వ తేది ఏసీబీ అధికారులు తనిఖీ చేసి ఎనిమిదిమందిపై కేసులు నమోదు చేశారు. తహసీల్దార్ టి.జి. మోహనవళ్ళి, డిప్యూటీ తహసీల్దార్ టి.బి. నరేష్ కుమార్, అదనపు రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ సి. అశోక్‌కుమార్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ బి. గోవర్ధన్ యాదవ్, గ్రేడ్-1 వీఆర్వోలు జి. సుబ్రహ్మణ్యం, సురేష్‌కుమార్, గ్రామ రెవిన్యూ అధికారులు ఎస్. కరుణాకరన్, ఎ. వెంకటముని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అదనంగా నగదు ఉంచుకోవడం, పట్టాదారు పాసుపుస్తకాలు సకాలంలో ఇవ్వకపోవడం వంటి అంశాలను ఏసీబీ అధికారులు గుర్తించారు. అప్పటి తహసీల్దార్ టి.జి. మోహనవళ్ళి ఆర్టీఐ పిటీషన్లకు నిర్ణీత కాలంలోగా జవాబు ఇవ్వకపోవడం, రెండు డిజిటల్ కీస్ తనవద్ద ఉంచుకోవాల్సివుండగా, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగినికి ఇవ్వడం, ఇన్‌వార్డ్ రిజిస్టర్, సీఎల్ రిజిస్టర్ వంటివి సక్రమంగా నిర్వహించకపోవడం, స్పందన వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడం, వీఆర్వో వద్ద 10 ఈ-పట్టాదారు పాసుపుస్తకాలు ఉంచుకొని సకాలంలో అర్హులకు ఇవ్వకపోవడం వంటి తప్పిదాలను ఏసీబీ గుర్తించింది. ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఎనిమిదిమంది ప్రభుత్వ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు.

వేణుగోపాలుడికి వైభవంగా తెప్పోత్సవం



పుష్కరిణిలో తెప్పపై విహారం



ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం

వెదురుకుప్పం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో తెప్పోత్సవాలు బుధవారం శాస్త్రోక్తంగా మొదలయ్యాయి. ఆలయ ఆవరణలో ఉన్న సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి మూల విరాట్టును పట్టు వస్త్ర, సుగంధభరిత పుష్పమాలికలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 9 గంటలకు ఉత్సవ విగ్రహాలకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఇంటింటా కర్పూరహారతులతో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.తర్వాత స్కంధ పుష్కరిణిలో ఏర్పాటు చేసిన తెప్పపై ప్రతిష్ఠించారు. మేళతాళాల నడుమ సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి తెప్పలపై విహరించి భక్తులకు అభయమిచ్చారు.హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి, సంగీత కార్యక్రమాలను నిర్వహించారు.ఆలయ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, వేదపండితులు శబరీష్, రమేష్, గోపాలాచారి, షరాబు బాబు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గజరాజుల బీభత్సం

● చింతలవంక వద్ద 15 ఏనుగుల గుంపు
● ఆందోళనలో అటవీ సరిహద్దు ప్రాంతాల ప్రజలు



అడవిలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు



ధ్వంసమైన టమోటా పంటను చూపిస్తున్న లీలాకృష్ణమ నాయుడు దంపతులు

కల్లూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి):పాకాల మండలంలో మంగళవారం రాత్రి పులిచెర్ల మండలానికి చెందిన రైతుల పంటలను ధ్వంసం చేసిన 16 ఏనుగుల గుంపు బుధవారం సాయంత్రానికి పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ సమీపంలోని తూర్పు విభాగం అటవీ ప్రాంతం చింతలవంక వద్దకు చేరుకున్నాయి.15 ఏనుగుల గుంపు చింతలవంక వద్దకు చేరుకోగా ఒక ఏనుగు ఒంటరిగా అడవిలోని మరొక ప్రాంతంలో సంచరిస్తోంది.కొన్నాళ్లుగా పులిచెర్ల మండలంలో మాటు వేసిన ఏనుగుల గుంపు పంటలకు అపారనష్టం కలిగించాయి. 15 రోజుల క్రితం మండలాన్ని వీడిన 16 ఏనుగుల గుంపు సదుం, సోమల మండలాల్లో పంటలను ధ్వంసం చేశాయి.సోమల మండలానికి చెందిన రైతు రామకృష్ణమరాజుపై ఏనుగులు దాడి చేయడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదే ఏనుగుల గుంపు సోమల మండలం నుంచి సదుం మండలం మీదుగా పాకాల మండల సరిహద్దులోని అడవిలోకి చేరుకున్నాయి. మంగళవారం రాత్రి పాకాల మండలం వల్లివేడు పంచాయతీ సమీపంలోని అడవి నుంచి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు వల్లివేడు, పాలగుట్టపల్లి పంచాయతీల మీదుగా పులిచెర్ల మండల సరిహద్దులోకి చేరుకున్నాయి. రాయవారిపల్లి పంచాయతీ ఉప్పుచెరువుకు చెందిన లీలాకృష్ణమ నాయుడు, కొత్తరామాపురానికి చెందిన సుధాకర నాయుడు, దినకర నాయుడు, మద్దేవారిపల్లికి చెందిన జయచంద్ర నాయుడు తదితరులకు పాకాల మండలం వల్లివేడు రెవెన్యూ గ్రామంలో భూములున్నాయి. లీలాకృష్ణమ నాయుడు పండించిన 2 ఎకరాల టమోటా పంటను, కొబ్బరిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. పొలం వద్ద ఉన్న స్కూటర్, డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి. సుధాకర నాయుడు, దినకర నాయుడు, జయచంద్రనాయుడులకు చెందిన మామిడితోటల్లో కొమ్మలను విరిచేశాయి. కొత్తరామాపురానికి చెందిన అశోక్‌కుమార్ పండించిన పశుగ్రాసాన్ని తొక్కేశాయి. అనంతరం మండల సరిహద్దును దాటుకొని తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోకి చేరుకున్నాయి. బుధవారం పగలంతా అటవీ ప్రాంతంలో సంచరించిన ఏనుగులు సాయంత్రానికి పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ సరిహద్దులోని చింతలవంక వద్దకు చేరుకున్నాయి.కాబట్టి పాళెం, దేవళంపేట, కల్లూరు, కమ్మపల్లి పంచాయతీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌బీవోలు మధు, కృష్ణమూర్తి, విజయభాస్కర్ సూచించారు.





ఆలయం ముందు కుమారుడు రిత్విక్‌తో రమ్యకృష్ణ - ప్రేమ్ సింగ్ తమంగ్

ప్రముఖ సినీనటి రమ్యకృష్ణ కుమారుడు రిత్విక్ వంశీతో కలిసి బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.అలాగే సిక్కిం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమంగ్, కర్ణాటక హోంమంత్రి గంగాధరయ్య పరమేశ్వర, సినీనటి సత్యశ్రీ కూడా బుధవారం శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేడు తలకోనలో వన్యప్రాణి,అటవీ సంరక్షణపై సమావేశం

ఎర్రావారిపాల్యెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తలకోనలో వన్యప్రాణి, అటవీ సంరక్షణపై గురువారం జిల్లా స్థాయి సమావేశం జరగనుంది. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పోలీస్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులు పాల్గొంటారు. అటవీ, వన్యప్రాణులు సంరక్షణకు సంబంధించి క్షేత్ర స్థాయిలో తీసుకుంటున్న చర్యలపై చర్చించనున్నారు. శేషాచలంలోని తలకోన జీవవైవిధ్య ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఈ అభయారణ్యంలో వన్యప్రాణుల వేటను అధికారులు పూర్తిస్థాయిలో అరికట్టలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. వివిధ సందర్భాల్లో 49 ఏనుగులు ఇప్పటివరకూ మృత్యువాత పడ్డాయి. విద్యుత్ తీగలు తగలడం, అనారోగ్యం, ప్రమాదకర బావుల్లో పడడం లాంటి కారణాలతో ఇవి చనిపోతున్నాయి. అదే సమయంలో తమపంటను కాపాడుకునే క్రమంలో ఏనుగుల దాడిలో పలువురు రైతులు ప్రాణాలు పోగొట్టుకొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిహారం వేగంగా అందుతోందని బాధిత రైతులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో జిల్లా స్థాయి అధికారుల సమావేశం జరగనుంది.


సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.71 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,951

తలనీలాలు సమర్పించినవారు: 27,143



వెంకటగిరి కళనేత

వెంకటగిరి, ఆంధ్రజ్యోతి

వెంకటగిరి అనగానే చేనేత గుర్తుకొస్తుంది. మూడు వందల ఏళ్లకు పైగా చేనేత చరిత్ర గలిగిన ఊరు ఇది. 1600, 1700 మధ్య కాలంలో వెంకటగిరి రాజకుటుంబం చేనేత కళాకారులను దూర ప్రాంతాల నుంచి వెంకటగిరికి తీసుకువచ్చారని చెబుతారు. ఏటా రాజులు నిర్వహించే కుస్తీ పోటీల్లో విజేతలకు వెండి జరీతో నేసిన కండువా కప్పేవారు. నేత తలపాగా చుట్టేవారు. వీటిని స్థానికంగానే నేసేవారు. వెంకటగిరి రాజకుటుంబం వస్త్రాలన్నీ ఇక్కడే నేసేవారు. 50 ఏళ్ళ కిందటే వెంకటగిరికి చెందిన నేత కళాకారుడు బత్తిన వెంకటసుబ్బయ్య బెంగుళూరు చేనేత సర్వీస్ సెంటర్‌లో పనిచేస్తూ అగ్గిపెట్టెలో పట్టే చీరను నేసి చరిత్ర సృష్టించారు. ఈ చేనేత కళా సంప్రదాయం ఇప్పటికీ వెంకటగిరిలో కొనసాగుతోంది. చీరలు, డ్రెస్‌లతో పాటూ అద్భుత చిత్రాలను వస్త్రంపై నేసి ఆశ్చర్యపరుస్తున్నారు. ఆధునిక సాంకేతికతనూ నేతకు ఈతరం కళాకారులు జోడిస్తున్నారు. వెంకటగిరి నుంచే 12 మంది చేనేత కళాకారులు జాతీయ పురస్కారాలు అందుకున్నారు. ఐదుగురిని సంత్‌కబీర్ అవార్డులు కూడా వరించాయి. ఇక జాతీయ మెరిట్ పురస్కారాలను ఇద్దరు అందుకున్నారు. వెంకటగిరి చేనేతకు వన్నె తెస్తున్న కొంత మంది నేత కళాకారుల పరిచయం.. చేనేత దినోత్సవం సందర్భంగా..



వన్నె తెచ్చిన కళాకారులకు వందనం

జాతీయ అవార్డులు అందుకున్నవారు 12 మంది

ఐదుగురిని వరించిన సంతకబీర్ పురస్కారాలు


ఇద్దరికి జాతీయ మెరిట్ సర్టిఫికెట్లు



కూనా మల్లిఖార్జున్:

12వ ఏట నుంచే మగ్గంలో దిగిన కూనా మల్లిఖార్జున్ 8వ తరగతి వరకే చదువుకున్నారు. సంప్రదాయ నేత విధానానికి ఆధునిక సాంకేతికత జోడించాలన్న ఉత్సాహం ఈయనది. నేతను మరింత సులువు చేయాలన్న ఆలోచనతో చెన్నై, మదురై వంటి ప్రాంతాల్లో తిరిగి స్టాండ్ మగ్గాల పై పట్టు సాధించారు. జాకార్డు , డాబీ, పైటపేటు, అంచు పేటు నేయడంలో సులువైన పద్ధతులు అవలంబిస్తున్నారు. 1996లో పెళ్ళి సాంప్రదాయం ఉట్టి పడేలా నేసిన చీరకు జాతీయ అవార్డు లభించింది. అలాగే రెండు నెలల శ్రమతో నేసిన ట్రీ ఆఫ్ లైఫ్ కి సంత్‌కబీర్ అవార్డును అందుకున్నారు.

> నేతకు నూతన సాంకేతికతను జోడించడం అవసరం. నేను తిరిగి నేర్చుకున్నది వంద మందికి నేర్పించా. నా శిష్యులు కూడా జాతీయ అవార్డులు అందుకున్నారు. ఉత్సాహం కన్నా బతుకు ముఖ్యం కదా. నేను కూడా ఇప్పుడు మార్కెట్‌లో డిమాండ్ ఉండే చేరలకే పరిమితం అయ్యా.







> నేను నేసిన నేత చిత్రానికి ఇక్కడి వారు రూ 10 వేలు వెలకట్టారు. అదేచీర బాంబే ఎగ్జిబిషన్‌లో రూ 4లక్షలు పలికింది. నూతన డిజైన్‌లు అమ్ముకొనేందుకు ప్రభుత్వం వేదిక ఏర్పాటు చేయాలి.

లక్కా శ్రీనివాసులు: గోకులంలో బృందావనం డిజైన్ నేసినందుకు 2015లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకున్న లక్కా శ్రీనివాసులు పదవ ఏట నుంచే చేనేతలో ఉన్నారు. గోడమీద వేలాడదీసే ఈ అందమైన చిత్రం నేయడానికి రెండు నెలలు పట్టింది. అలాగే ఈయన నేసిన లక్ష్మీవృక్షం చిత్రానికి సంత్‌కబీర్ అవార్డును ప్రకటించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రదాని చేతుల ప్రస్తుతం లక్ష్మి వృక్షం వాల్ హ్యాంగింగ్ సంతకబీర్ అవార్డుకు ఎంపికైంది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రదాని చేతుల మీదుగా ఢిల్లీలో ఈ పురస్కారం అందుకోబోతున్నారు. ఈ చిత్రం నేయడానికి నాలుగు నెలలు పట్టింది.





పట్నం మునిరాజా: 8వ ఏట నుంచే చేనేత వృత్తిలో ఉన్న ఈయన 9వ తరగతికే చదువుకు టాటా చెప్పేసారు. తండ్రి లాగే కొత్త డిజైన్లు నేయాలన్న తపనతో తీగలపై చిలుకలు డిజైన్‌ను చీరకు రెండు వైపులా వచ్చేలా నేసారు. అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా జాతీయ పురస్కారం అందుకున్నారు. నాలుగు నెలలు ఇందుకోసం శ్రమించారు.

> యువతలో చేనేతపై ఆసక్తిని పెంచాలన్నది నా కోరిక. కొత్త డిజైన్ల నేతపై వారికి తగిన శిక్షణ ఇవ్వాలి. ప్రభుత్వం సహకరిస్తే ఈ పని చేయాలని ఉంది.





పట్నం చీరాలరెడి :

ఐడి చదువులకన్నా విలువైన విద్య కళ రూపంలో ఈయనకు అబ్బింది. 2015లో మూడు నెలల కష్టం, రూ 70 వేల ఖర్చుతో నదీతీరంలో శ్రీకృష్ణ బలరాములు గోవులు మేపే డిజైన్ నేసినందుకు జాతీయ అవార్డు అందుకున్నారు. అలాగే 2017ఓ అనంత పద్మనాభస్వామి చిత్రానికి రాష్ట్రపతి చేతుల మీదుగా సంతకబీర్ అవార్డు అందుకున్నారు.



> మా అబ్బాయితో పాటూ 45 మందికి చేనేతపనిలో శిక్షణ ఇచ్చా. నా శిష్యులు కూడా కొత్త డిజైన్లు నేస్తున్నారు. ఎప్పటికైనా పద్మశ్రీ వరిస్తుందనే నమ్మకంతో ఉన్నా.

సజ్జా వీరయ్య

మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమో చేసిన ఈయన 7వ ఏట నుంచే చేనేతలో ఉన్నారు. 2000లో నాలుగు నెలలు కష్ట పడి నేసిన పురివిప్పిన నెమలి డిజైన్ చీర జాతీయ అవార్డు తెచ్చిపెట్టింది. అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ చేతులు మీదుగా అవార్డు అందుకోవడం మరచిపోలేని అనుభవం అంటున్నారు ఈయన.

> ఆర్థిక పరిస్థితులు అనుకూలించక చేనేతకు దూరమయ్యా. ప్రభుత్వం చేయూతనిస్తే చేనేతలో కొత్త ఒరవడి తీసుకు వచ్చేలా యవతను తయారు చేస్తా.



బోగా రాము

రాము 12 ఏళ్ల వయసు నుంచే నేతపనిలో ఉన్నారు. చదువుకున్నది 6వ తరగతి దాకానే. ఇంటి పరిస్థితులు అనివార్యంగా మగ్గం గుంటలో దించేశాయి. కొత్త డిజైన్లు నేయాలనే ఉత్సాహమే ఈయనకు 1999లో అప్పటి ఉపరాష్ట్రపతి కృష్ణ కాత్ చేతులు మీదుగా జాతీయ అవార్డు అందుకునేలా చేసింది. కర్పూరం డిజైన్ చీరకు ఈ పురస్కారం లభించింది.

> మా నాయన కల జాతీయ అవార్డు సాధించాలన్నది. ఆయనకు సాధ్యం కాలేదు. నేను సాధించి ఆయనకు అంకిత మిచ్చా."





గౌరాబత్తిన రమణయ్య:

బాల్యంలోనే మగ్గం పని నేర్చుకున్నారు. అప్పట్లో మెట్రిక్యులేషన్ పాసయ్యారు. 81 ఏళ్ల వయసులోనూ మగ్గం నేస్తారు. తీగల్లో అమరిన చిలుకలు డిజైన్‌కు జాతీయ అవార్డు లభించింది. దీనిని నేయడానికి 75 రోజులు పట్టింది.





పట్నం మునిబాబు :

4వ తరగతికే చదువు ఆపేసి చేనేతలోకి దిగిన మునిబాబు ఈ కళలో రాణిస్తున్నారు. ఈయన నేసిన గోవర్ధనగిరి డిజైన్ చీరకు జాతీయ అవార్డు లభించింది. ఈ చీర నేయడానికి నాలుగు నెలలు పట్టింది.



సంస్కృత భాషా వారోత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు

సమాజానికి సంస్కృతం దిక్సూచి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సమాజానికి సంస్కృతం దిక్సూచి అని అక్షర పురుషోత్తదామం(ఢిల్లీ) అధ్యక్షుడు భద్రేశదాస స్వామి పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సంస్కృత భాషా వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బుధవారం చెలికాని అన్నారావు భవనంలో జరిగిన కార్యక్రమంలో భద్రేశదాసు స్వామి అనుగ్రహభాషణం చేశారు. ఇంఛార్జి వీసీ నాగరాజు మాట్లాడుతూ.. భారతీయ విజ్ఞానానికి మూలం సంస్కృతమన్నారు. సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. సంస్కృత భాషను మరింతగా వ్యాప్తి చేయడానికి కృషి జరగాలన్నారు. ప్రఖ్యాత సంస్కృత ప్రొఫెసర్ కొంపెల్ల రామసూర్యనారాయణ, రిజిస్ట్రార్ వెంకటనారాయణరావు, పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎడ్యుకేషన్ విభాంలో అత్యాధునిక క్లాస్‌రూములను వీసీ కృష్ణమూర్తి ప్రారంభించారు. కాగా సంస్కృత యూనివర్సిటీలో గోవింద భగవత్పాదాచార్యుల వాక్యర్థ సభలో భద్రేశదాసస్వామి, వీసీ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొని మాట్లాడారు.

టీటీడీ డీఎఫ్‌వోకు అదనపు బాధ్యతలు

తిరుమల, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): టీటీడీ డీఎఫ్‌వో పణికుమార్ నాయుడికి ఐటీ ఇన్‌ఛార్జ్ జీఎంగా అదనపు బాధ్యతలు అప్పగించారు. టీటీడీ ట్రాన్స్‌పోర్టు జీఎంగా ఉన్న శేషారెడ్డి కొన్నేళ్లుగా ఐటీ ఇన్‌ఛార్జ్ జీఎంగా అదనపు విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల డిప్యూటేషన్‌పై టీటీడీ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా నియమితులైన పణికుమార్ నాయుడికి ఐటీ ఇన్‌ఛార్జ్ జీఎంగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అగ్రిగోల్డ్ భూములను పరిశీలించిన సీఐడీ అధికారులు

దొరవారిసత్రం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం అక్కరపాక రెవెన్యూ పరిధిలో ఉన్న 108 ఎకరాల అగ్రిగోల్డ్ భూములను బుధవారం తిరుపతి సీఐడీ అధికారులు పరిశీలించారు. నెల్లూరు సీఐడీ ఆర్‌వో పరిధిలో ఉన్న ఈ భూములను తిరుపతి సీఐడీ ఆర్‌వో పరిధిలోకి తీసుకోవడంతో అధికారులు భూములను పరిశీలించారు. సీఐడీ సీఐ రంగస్వామి, ఎస్ఐ ధరణిధర్, సిబ్బంది, స్థానిక వీఆర్‌వో జ్ఞానేంద్రతో కలిసి భూములను పరిశీలించారు. ఇక్కడ భూములను ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు సీఐడీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అగ్రిగోల్డ్ భూముల్లోకి ఎవ్వరూ ప్రవేశించకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐడీ అధికారులు చెప్పారు.

అమ్మవారికి కానుకగా వెండి దీపాలు



వెండి దీపాలను అందజేస్తున్న రమణారావు

తిరుచానూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారికి కెనడాకు చెందిన రమణారావు బుధవారం రూ.6లక్షల విలువ చేసే వెండి తుంగవాళి దీపాలను ఆలయ అధికారులకు అందజేశారు. 4.14 కిలలో బరువుగల తుంగవాళి (వేలాడే దీపాలు)ని అర్చకుడు బాబుస్వామి, ఏఈవో దేవరాజులు, ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

సకాలంలో విద్యా రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్యా రుణాలను సకాలంలో మంజూరు చేయాలని జేసీ శుభం బన్సల్ బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో పలు విశ్వవిద్యాలయాలున్నాయని, విద్యకు సంబంధించిన రుణాలకు ప్రత్యేక ప్రాధాన్యతతో మంజూరు చేయాలని అన్నారు. పీఎంఈజీసీ పథకం కింద మంజూరైన యూనిట్లు అన్ని గ్రౌండింగ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్టాండప్ ఇండియా రుణాలు బ్రాంచ్‌ల వారీగా లక్ష్యాలను అందిపుచ్చుకోవాలని తెలిపారు. రైతులకు క్రాప్‌లోను మంజూరు చేసే సమయంలో పంటలకు ఇన్సూరెన్సు చేయించాల్సిన బాధ్యత బ్యాంకు అధికారులపై ఉందన్నారు. ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, వ్యవసాయశాఖ పీడీ ప్రసాదరావు, మార్కెటింగ్ అధికారి సురేంద్రబాబు, యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ సామంచి శర్మ, ఎల్డీఎం రవికుమార్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా భవానీ ప్రసాద్

తిరుపతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా పి.భవానీప్రసాద్ నియమితులయ్యారు. పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్‌ను ప్రస్తుతం ఖాళీగా ఉన్న శ్రీకాళహస్తి కమిషనర్ పోస్టులో నియమిస్తూ రాష్ట్ర మున్సిపల్ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఈటీసీలో ఏవోగా మధుసూదన్

శ్రీకాళహస్తిలోని ఈటీసీ (ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్)లో ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ (అగ్రికల్చర్ ఆఫీసర్) పోస్టులో ఏ.మధుసూదన్ నియమితులయ్యారు. వరదయ్యపాళెం మండలంలో ప్రస్తుతం డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం డెప్యుటేషన్‌పై ఈటీసీ ఫ్యాకల్టీగా నియమించింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నిబంధనల మేరకే వినాయక విగ్రహాల ఏర్పాటు

- డీజే సౌండ్లు, సినిమా పాటలతో ఇబ్బందిపెడితే చర్యలు
- ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినాయక విగ్రహాలను నిబంధనల మేరకు ఏర్పాటు చేయాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. వినాయక చవితి సందర్భంగా తిరుపతిలో విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాలతోపాటు ఊరేగింపుగా వెళ్లే రోడ్లను అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ భక్తవత్సలం, సీఐ రాంకిషోర్, ఎస్ఐలతో కలసి ఆయన బుధవారం పరిశీలించారు. డీజే సౌండ్లు, సినిమా పాటలతో ప్రజలను ఇబ్బందిపెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. మద్యం తాగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లే ఎస్వీనగర్, పద్మావతీనగర్, రాళ్లపల్లి సర్కిల్, ఎమ్మార్‌పల్లె, పూర్ణకుంభం సర్కిల్, లీలామహల్ సర్కిల్, వినాయకసాగర్ చెరువు, లింగాల చెరువులను పరిశీలించి, పలు సూచనలిచ్చారు. ఈ తనిఖీల్లో సీఐలు రామయ్య, ఎస్ఐ లోకేష్‌బాబు పాల్గొన్నారు.



వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాలపై ఆరా తీస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

కారు బోల్తా : తప్పిన ప్రమాదం



ప్రమాదకర బావి వద్ద బోల్తాపడిన కారు

ఐరాల (కాణిపాకం), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాణిపాకానికి అతి సమీపంలో ఉన్న మద్దిపట్లపల్లె వద్ద ఉన్న చెరువుకట్టపై ఓ కారు అదుపు తప్పి బోల్తాపడింది. స్థానికుల కథనం మేరకు.. కడప జిల్లా ఖాజీపేట వాసులు కాణిపాకానికి బయలుదేరారు. ఈ క్రమంలో చెరువుకట్టపై ఉన్న మలుపు వద్ద కారును నడుపుతున్న పరమేశ్వర్ నిద్రమత్తులోకి వెళ్లాడు. కారు అదుపు తప్పి బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న సుధాకర్ చేతికి గాయమైంది. కారు మరో మూడు అడుగులు బోల్తా కొట్టి ఉంటే పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడి పెను ప్రమా దం జరిగేది.

వ్యవసాయ బావిని పూడ్పించండి

గత సంవత్సరం నవంబరు 28న యాదమరి మండలం కమ్మరాయునిమిట్టకు చెందిన టీఎల్.రితీష్(19) పీలేరులోని ఎంజేఆర్ కళాశాలలో చదివేవాడు. తన మిత్రుడితో కలసి ఈ మార్గంలో ద్విచక్రవాహనంపై చిత్తూరుకు వస్తూ వాహనం అదుపు తప్పి చెరువుకట్ట పక్కన ఉన్న వ్యవసాయ బావిలో బోల్తాపడ్డారు. రితీష్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ వ్యవసాయబావి నిరుపయోగంగా ఉంది. త్వరలో కాణిపాకం బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నందున ఈ మార్గంలో వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని బావిని పూడ్పించాలని స్థానికులు కోరుతున్నారు.

వరసిద్ధుడిని దర్శించుకున్న రమ్యకృష్ణ



సినీనటి రమ్యకృష్ణకు జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్ వాసు

ఐరాల (కాణిపాకం), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటి రమ్యకృష్ణ బుధవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆమెను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామివారి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆమెను వేదాశీర్వాద మండపంలో పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డబ్బులివ్వలేదని మాజీ భార్యపై దాడి

చిత్తూరు అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఖర్చులకు డబ్బులివ్వలేదని మాజీ భార్యపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కథనం మేరకు.. నగరంలోని మరాఠా వీధికి చెందిన మాధవి(38) స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. పాక్షికంగా దృష్టిలోపం ఉన్న ఆమెను ఇష్టపడి సురేష్‌బాబు పెళ్లి చేసుకున్నారు. కుటుంబంలో తలెత్తిన గొడవల కారణంగా ఈ ఏడాది ఏప్రిల్ 27వ తేదీన పెద్దల సమక్షంలో విడిపోయారు. అప్పటి నుంచి వేర్వేరుగా జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మరాఠా వీధిలోని భార్య ఇంటికి వెళ్లాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అతడు కలిసి ఉందామని ఆమెను కోరాడు. మాటామాటా పెరగడంతో దాడిచేశాడు. బాధితురాలు మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ధాన్యం ధర పతనం

- గతేడాదితో పోలిస్తే బస్తాకు రూ.310 తక్కువ
- తీవ్రంగా నష్టపోతున్న రైతు



ధాన్యాన్ని లారీకి లోడ్‌చేస్తున్న కూలీలు

పెళ్లకూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కన్నా తవుడు ధరే ఎక్కువ. అవును ఇది నిజం. ప్రస్తుతం మార్కెట్లో 80 కిలోల ఎంటీయూ 1010 రకం ధాన్యం బస్తాకు రూ.1300 రైతులకు చెల్లిస్తున్నారు. అదే ధాన్యాని మిల్లర్లో ఆడాక వచ్చే తవుడును మాత్రం పాడి రైతులకు 50 కిలోల బస్తా రూ.1350కి విక్రయిస్తున్నారు. ఈ పరిస్థితి ఎందుకంటే.. రైతులకు ఎంటీయూ 1010 వరి రకం సాగు లాభదాయకంగా ఉంటుంది. ఈ రకం ధాన్యం సాగు చేయొద్దని గత ప్రభుత్వం ఎందుకు ప్రకటించిందో తెలియదు. కానీ, ఖరీఫ్ సీజన్‌లో రెండో కారు పంట సాగుకు చీడపీడలను తట్టుకుని నిలబడేది మాత్రం ఎంటీయూ 1010 వరి రకం మాత్రమే. ఈ రకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలుకు అనుమతి.. మద్దతు ధర ప్రకటించకపోవడంతో దళారులు వారికి ఇష్టమొచ్చిన ధరకు కొంటున్నారు. గతేడాది ఇదే ఎంటీయూ 1010 రకం ధాన్యం 75 కిలోల బస్తా రూ.1610 పలకగా, ఈ ఏడాది రూ.1300 మించడంలేదు. దీనికి తోడు గతేడాది కంటే ఈ ఏడాది పెట్టుబడులు భారీగా పెరిగాయి. సాధారణంగా ఒక ఎకరా సాగుకు రూ.25 వేలు ఖర్చవుతుండగా ప్రస్తుతం రూ. 35 వేలు దాటిందని రైతులు చెబుతున్నారు. అదే సమయంలో గతేడాది కన్నా బస్తాపై రూ.310 ధర తగ్గడంతో రైతులు నష్టపోతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం 'మద్దతు' ధర ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అంతరిక్ష జ్ఞానంపై ఆసక్తి చూపండి

విద్యార్థులకు కలెక్టర్ పిలుపు



నేషనల్ స్పేస్ డే వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అంతరిక్ష జ్ఞానంపై ఆసక్తి చూపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. నేషనల్ స్పేస్ డే సందర్భంగా బుధవారం స్థానిక సీతమ్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు.

2023లో చంద్రయాన్-3 విజయవంతంగా ప్రయోగించిన సందర్భాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం ఏటా ఆగస్టు 6వ తేదీని జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహిస్తోందన్నారు. తొమ్మిదవ తరగతి నుంచి విద్యార్థులు అంతరిక్ష పరిశోధనల అంశాలపై ఆసక్తి చూపాలని సూచించారు. ప్రభుత్వం నేషనల్ అటామిక్ రీసెర్చ్ లేబొరేటరీ సహకారంతో విద్యార్థులకు త్వరలో 50 రోజుల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ చంద్రయాన్ 1,2,3 లక్ష్యాలు, వాటి విశిష్టత గుర్తించి సమీక్షించారు. కళాశాల ఆవరణలో రాకెట్ లాంచింగ్, క్విజ్ పోటీలు, నమూనాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఏఆర్ఎల్ డైరెక్టర్ అమిత్‌కుమార్ పాత్రా, షార్ జీఎం కృతివాసన్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలపతి, కళాశాల కార్యదర్శి బద్రినారాయణ, ఉన్నత పాఠశాలల, జూనియర్ ఇంటర్, యూజీ, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

22 పాఠశాలల్లో ఓసాట్ కార్యక్రమాలు : జిల్లాలోని ఏడు మండలాల్లో ఎంపిక చేసిన 22 ఉన్నత పాఠశాలల్లో ఓసాట్ సంస్థ సహకారంతో సాంకేతిక సహాయం అందుబాటులోకి రానున్నట్లు జేసీ విద్యాధరి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వివేకానంద భవన్‌లో తిరుపతి రాస్ సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, ఓసాట్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుధీర్‌తో కలిసి ఓసాట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో అభ్యసనా సామర్థ్యాలు పెంచేందుకు సాంకేతిక సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. వీటిని అందిపుచ్చుకుని విద్యార్థులు రాణించాలని సూచించారు. ఎంపిక చేసిన ఒక్కో పాఠశాలకు ఓసాట్ నుంచి మూడు ల్యాప్‌టాప్‌లు, 25 ట్యాబ్‌లు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

క్షేమంగా అక్క వద్దకు..!

- నెలిమర్లకు చేరుకున్న వెంకట్రావు
- భావోద్వేగంతో కన్నీటి పర్యంతం
- 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపిన కుటుంబీకులు



నెలిమర్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నెలన్నర తర్వాత వెంకటరావు అక్కను చేరుకున్నారు. తిరుపతి నుంచి మంగళవారం కారులో బయలుదేరిన ఆయన.. బుధవారం ఉదయం 7.30 గంటలకు విజయనగరం జిల్లా నెలిమర్లలోని బృందావన కాలనీలో ఇంటికి వచ్చారు. అక్క అరుణాపాఢిక్‌ను చూడగానే ఆనందాశ్రువులతో పలకరించారు. ఓ పక్క దుఃఖం.. మరో పక్క ఆనందం కలగలిపిన భావోద్వేగంతో ఇద్దరికీ కాసేపు నోటిమాట రాలేదు. 'ఆంధ్రజ్యోతి' వల్లే తాను అక్క వద్దకు చేరగలిగానని, పునర్జన్మను ప్రసాదించిందంటూ వెంకటరావు పదే పదే కృతజ్ఞతలు తెలిపారు. రాఖీ పండుగకు తమ్ముడిని ఆ దేవుడే ఇంటికి పంపాడంటూ అరుణాపాఢిక్ సంతోషం వ్యక్తంచేశారు. సహకారం అందించిన 'ఆంధ్రజ్యోతి'కి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడికి కృతజ్ఞతలు తెలిపారామె. అనంతరం వెంకటరావును అక్క, బావ లోపలకు తీసుకెళ్లి సపర్యలు చేసి అల్పాహారం అందించారు. ఇంతలో నగర పంచాయతీ కమిషనరు జయరాం, వైద్య సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఆయన ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. పలువురు నేతలు, అధికారులు ఆయన్ను కలిసి మాట్లాడారు.

పర్యాటక శాఖ, టీటీడీ నడుమ
25 ఎకరాల భూమి బదలాయింపు

- ఉచిత విద్యుత్ 200 యూనిట్లకు పెంచడంతో 2 వేల సెలూన్లకు లబ్ధి
- తిరుపతి రెడ్ శాండర్స్ కోర్టుకు ఏపీపీ పోస్టు మంజూరు
- మంత్రిమండలి సమావేశ నిర్ణయాలు

తిరుపతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పర్యాటక శాఖ, టీటీడీ నడుమ 25 ఎకరాల భూమి బదలాయింపునకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రిమండలి జిల్లాకు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకుంది. తిరుపతి అలిపిరి-చెర్లోపల్లి మార్గంలో ఏపీ పర్యాటక శాఖకు చెందిన 25 ఎకరాల భూమిని ఒబెరాయ్ తదితర హోటళ్ల నిర్మాణానికి కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే అలిపిరిలో శేషాచల పర్వత పాదాల చెంత హోటళ్ల నిర్మాణానికి పలు సంస్థలు అభ్యంతరం తెలిపాయి. తిరుమల పవిత్రత దెబ్బతింటుందనే అభ్యంతరాల నడుమ టీటీడీ పాలకమండలి సైతం ఓ తీర్మానం ఆమోదించి ప్రభుత్వానికి పంపింది. దీంతో సీఎం చంద్రబాబు ఈ భూమి కేటాయింపులపై దృష్టి సారించారు. అలిపిరి సమీపంలో టీటీడీయేతర సంస్థలకు భూమి కేటాయింపులు జరపరాదని నిర్ణయించారు. ఆ మేరకు అప్పటికే పర్యాటక శాఖ అక్కడ పాతిక ఎకరాల భూమిని ఒబెరాయ్ తదితర సంస్థలకు కేటాయించిన క్రమంలో ఆ కేటాయింపులను రద్దే చేసింది ప్రభుత్వం. తాజాగా పర్యాటక శాఖ ఆధీనంలోని 25 ఎకరాల భూమిని టీటీడీకి కేటాయిస్తూ దానికి ప్రతిగా అక్కడికి సమీపంలోని టీటీడీకి చెందిన భూమిని పర్యాటక శాఖకు కేటాయించే ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదించింది.

● నాయీ బ్రాహ్మణ సంఘాల వినతి మేరకు ప్రభుత్వం ఇప్పటి దాకా హెయిర్ కటింగ్ సెలూన్లలో నెలవారీ 150 యూనిట్ల వరకూ ఇస్తున్న ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్ల వరకూ పెంచేందుకు మంత్రిమండలి ఆమోదించింది. దీంతో జిల్లాలోని 2 వేల హెయిర్ కటింగ్ సెలూన్ల నిర్వాహకులకు లబ్ధి కలగనుంది. ● తిరుపతిలో ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల విచారణకు జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ స్థాయి కలిగిన ప్రత్యేక కోర్టు ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఈ కోర్టులో కేసులకు సంబంధించి ప్రభుత్వం తరపున వాదనలు వినిపించేందుకు అదనపు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టు మంజూరుకు మంత్రిమండలి ఆమోదించింది.

తిరుపతిలో క్రీడా సందడి



బాస్కెట్‌బాల్ పోటీలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో క్రీడా సందడి నెలకొంది. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఎస్‌డీవో శశిధర్ ఆధ్వర్యంలో బుధవారం వివిధ క్రీడాంశాల జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఎస్వీయూ, శ్రీనివాస క్రీడా సముదాయం, ఎస్వీఆర్ట్స్, ఓల్డ్ ఏజీఎస్ కాలేజీ మైదానాలు వేదికగా అథ్లెటిక్స్, ఆర్చరీ, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, హాకీ, వాలీబాల్ క్రీడలు నిర్వహిస్తున్నారు. వీటిలో ఐదు క్రీడాంశాలు ప్రారంభంకాగా మిగిలినవి గురువారం మొదలుకానున్నాయి. జిల్లా నలుమూలల నుంచి వాలీబాల్ 120, కబడీ 75, ఖోఖో 60, అథ్లెటిక్స్ 50, బాస్కెట్‌బాల్ 25మంది చొప్పున క్రీడాకారులు హాజరయ్యారు. డీఎస్‌ఏ కోచ్‌లు క్రీడాకారుల పేర్ల నమోదు చేసుకొని పోటీలను పర్యవేక్షించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా క్రీడావేదికల వద్ద శాప్ ఆధ్వర్యంలో తాగునీరు, భోజనం, చల్లవపందిళ్లు, వసతి సదుపాయాలు కల్పించారు.



చేనేతలకు అండగా సీఎం చంద్రబాబు : ఎంపీ

చిత్తూరు సిటీ, ఆగస్టు 6: చేనేతలకు సీఎం చంద్రబాబు అండగా ఉంటారని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు చేనేతలకు ఆగస్టు 7 నుంచి ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నారని వెల్లడించారు. మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్లు తెలియజేశారు. రూ.125 కోట్లు వెచ్చించి అమలు పరుస్తున్న ఈ పథకం ద్వారా 50 వేల మగ్గాలు, 15 వేల మరమగ్గాల వారికి లబ్ధికలగనుందని పేర్కొన్నారు.

31న ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ, అసోసియేషన్ నాయకులు

చిత్తూరు క్రీడలు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చెస్ ఆడడం వల్ల పిల్లలో మేధోశక్తి పెరుగుతుందని ఎస్పీ మణికంఠ అన్నారు. నగరంలో ఈనెల 31వ తేదీన జరగనున్న ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌కు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రా చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఆర్‌బీ ప్రసాద్ మాట్లాడుతూ కొంగారెడ్డిపల్లిలోని ఆరణ్య సాయి ఫంక్షన్‌హాల్‌లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 31లోపు 9849313676, 9000475799 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రెయిల్ బాక్స్ చెస్ అకాడమీ డైరెక్టర్ యువణ్య, అసోసియేషన్ నాయకులు దినేష్, ఈశ్వర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు పద్మావతి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం

- నేడు టిక్కెట్ల విక్రయం



భక్తులు వేచి ఉండేందుకు ఏర్పాటు చేస్తున్న జర్మన్ షెడ్లు



ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు

తిరుచానూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించడానికి టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది. దాదాపు 30వేలమంది అమ్మవారి దర్శనానికి వస్తారని అంచనా. ఈ నేపథ్యంలో అన్నప్రసాదాలతో పాటు మౌలిక వసతుల కల్పనకు సిద్ధమయ్యారు. గేట్‌నెంబరు 4 (పాత పోలీస్‌స్టేషన్) వద్ద భక్తులు వేచి ఉండేందుకు జర్మన్ షెడ్లు, అక్కడి నుంచి ఆలయంలోకి వెళ్లడానికి క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆస్థాన మండపంలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పాంచరాత్ర ఆగమోక్తంగా వరలక్ష్మీ వ్రతం జరగనుంది. ఇప్పటికే ఆస్థాన మండపాన్ని ముస్తాబు చేశారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో టిక్కెట్లు విడుదల చేయగా.. గురువారం ఉదయం అమ్మవారి ఆలయ కుంకుమార్చన కౌంటర్‌లో కరెంటు బుకింగ్ ద్వారా 150 టిక్కెట్లను ఇవ్వనున్నారు. శుక్రవారం ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. సర్వదర్శనం మినహా ఎలాంటి సేవలు ఉండవని అధికారులు తెలిపారు. వ్రతం ముగిశాక సాయంత్రంపైన భక్తుల సంఖ్య తగ్గితే రూ.100, రూ.200 దర్శనం టిక్కెట్లు విక్రయించాలని యోచిస్తున్నారు. ఆరోజు సాయంత్రం అమ్మవారి స్వర్ణరథోత్సవం జరగనుంది.







ఉత్సవర్లకు పూజా కార్యక్రమం - శ్రీవారి ఆలయంలో పవిత్రాల ఊరేగింపు - ఆనందనిలయంపై పవిత్రాల సమర్పణ

పవిత్రం సమర్పయామి

పవిత్రోత్సవాల్లో రెండో రోజైన బుధవారం శ్రీవారి ఆలయంలో పవిత్ర సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం పవిత్ర మాలలను ఊరేగింపుగా తీసుకెళ్లి శ్రీవారి మూలవర్లతో పాటు ఆలయం లోపల, వెలుపల వివిధ దేవతామూర్తులకు సమర్పించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి మాడవీధుల్లో ఊరేగారు. రాత్రి 8 నుంచి 11 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

పవిత్రమాలల తయారీ ఇలా..

పవిత్రాలు చేయడానికి శ్రేష్ఠమైన జాతి పత్తి మొక్కలను.. తులసి పెంచడానికి ఉపయోగించే పెరటి భూమిలో పెంచతారు. మాలల తయారీకి 20 మూరల పట్టుదారం లేదా 200 మూరల నూలుదారం కానీ ఉపయోగిస్తారు. ఈ దారాలకు తెలుపుతో పాటు నలుపు, ఎరుపు, ఆకుపచ్చ, పసుపుపచ్చ రంగులు అద్దుతారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ధ్వజస్తంభానికి పవిత్ర మాల కట్టుతున్న అర్చకులు

ఎస్సీ వసతిగృహం తనిఖీ



సదుపాయాలపై విద్యార్థులను ఆరా తీస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహాన్ని కడా పీడీ వికాస్ మర్మత్ మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో భోజన సుపాయం, ఇతర వసతుల గురించి విద్యార్థులను ఆయన ఆరా తీశారు. వసతి గృహం నిర్వహణపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. తమకు ఆడుకునేందుకు ఆటస్థలం లేదని విద్యార్థులు ఈ సందర్భంగా పీడీ దృష్టికి తీసుకొచ్చారు. ఆటస్థలం కేటాయించి దాన్ని అభివృద్ధి చేసేందుకు పీడీ అక్కడికక్కడే రూ.లక్షలు మంజూరు చేశారు. వసతి గృహంలో వార్డెన్ల తీరు, హాజరు పట్టీని పరిశీలించారు. మరిన్ని వసతుల కోసం తగిన చర్యలు తీసుకుంటానని కడా పీడీ వికాస్ మర్మత్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంఈవో -2 రాజారాం తదితరులు

కుప్పం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం అడవిబూదుగూరు హరిజన వాడలోని మండల పరిషత్తు ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు అవసరమైన అదనపు గదులు, ప్రహరీ నిర్మాణానికి బుధవారం ఎంఈవో -2 భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల సర్వతోముఖాభివృద్ధికి కృతనిశ్చయంతో ఉందన్నారు. మౌలిక వసతులను కల్పించడమేకాక నాణ్యమైన విద్యను అందించడంతో ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడానికి విద్యాశాఖ ద్వారా కృషి జరుగుతోందన్నారు. అడవిబూదుగూరు హరిజనవాడ ఆదర్శ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి రూ.64 లక్షలు మంజూరు చేసిన కడా పీడీ వికాస్ మర్మత్‌కు ధన్యవాదాలు తెలిపారు. మూడు నెలల్లోగా తలపెట్టిన నిర్మాణాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిట్టిబాబు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, స్థానిక నాయకులు మాజీ ఎంపీటీసీ కృష్ణమూర్తి, మాజీ సర్పంచి చిట్టిబాబు, టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు గణేశ్, బాలకృష్ణ, శరవణ, ప్రకాశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

తోతాపురికి స్వస్తి..!

● టేబుల్ రకం వైపు రైతుల మొగ్గు



సోమల సమీపంలో నరికేస్తున్న తోతాపురి చెట్లు

సోమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో వాటి స్థానంలో టేబుల్ రకాలపై రైతులు ఉత్సాహం చూపుతున్నారు. మామిడి సీజన్ ముగియడంతో రైతులు తోటల్లో కత్తిరింపులకు శ్రీకారం చుట్టారు. అరకొరగా ఉన్న నీలం రకం కాయలు ముగింపు దశకు చేరుకున్నాయి. పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీల్లోనే 500 ఎకరాలకు మించి నీలం రకం కోతలు చేయాల్సి ఉంది. వీటి ధరలు సైతం టన్ను రూ.40 వేలకు మించి పలుకుతున్నాయి. మల్లికా రకం టన్ను రూ.70 వేలకు మించి పలుకుతుంది. తోటలు లీజుకు తీసుకున్న వ్యాపారులు ధర ల కోసం సీజన్ చివరి దశలో కోతలు చేసేందుకు పలు రకాల మందులు పిచికారీ చేశారు. ఇప్పుడు ధరలు పలుకుతున్న సమయంలో నీలం రకం, మల్లికా రకం కోతలు చేస్తున్నారు. ఇక పలువురు తోతాపురి చెట్లను రైతులే నరికేస్తున్నారు. మరికొందరు తోతాపురి చెట్లకు మల్లికా, నీలం రకం తదితర రకాల అంటు కట్టుకు శ్రీకారం చుట్టారు. 20 ఏళ్లకు మించిన తోటల్లో అధికంగా తోతాపురి రకాలే ఉండటంతో వాటిని తొలగిస్తున్నారు. మల్లికా రకం చీడపీడలను తట్టుకునే రకం కావడంతో ఆ రకం వైపు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. మార్కెట్‌లో మల్లికా రకానికి గిట్టుబాటు ధరలు ఎప్పుడూ ఉండటంతో ఆ రకం అంటు కట్టడానికే ఉత్సాహం చూపుతున్నారు.

అర్జీదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మధుసూదన్

సోమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అందిన ప్రతి అర్జీదారుని సమస్య పరిష్కరించడానికి వీఆర్వోలు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ మధుసూదన్ సూచించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జేసీ విద్యాధరి ఉత్తర్వులతో వీఆర్వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. అర్జీదారులను పదే పదే కార్యాలయంల చుట్టూ తిప్పుకోకుండా వారికి సరైన సమాధానం ఇవ్వాలన్నారు. భూతగాదాలపై జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలన్నారు. భూ సర్వేలు జాప్యం చేయకుండా సక్రమంగా జరపాలన్నారు. అర్జీదారులకు న్యాయం చేయాలని తెలిపారు.

నాయీ బ్రాహ్మణుల హర్షాతిరేకం



శాంతారాం ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

కుప్పం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించాలంటూ ఆంధ్రప్రదేశ్ మంత్రి మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయంపై నాయీ బ్రాహ్మణులు హర్షాతిరేకం వ్యక్తం చేశారు. కుప్పంలోని ఆర్టీసీ బస్టాండు కూడలిలో, ఎన్టీఆర్ విగ్రహం ఎదుట బుధవారం రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షులు, టీటీడీ పాలక మండలి సభ్యుడు వైద్యం శాంతారాం ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా శాంతారాం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్తును 150 నుంచి 200 యూనిట్లకు పెంచుతూ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గం చంద్రబాబుకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందన్నారు. ఉచిత విద్యుత్తు పరిమితిని 200 యూనిట్లకు పెంచినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మకు రాష్ట్ర నాయీ బ్రాహ్మణుల తరపున ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గంలోని నాయీ బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బడిబయట బాలిక స్కూల్లోకి ...!



పాఠశాలలో చేరిన బాలికతో ఉపాధ్యాయులు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బడికి మధ్యలో నిలిచిపోయి వ్యవసాయ పనులకు వెళుతున్న మండలంలోని ఎం.కొత్తూరు గ్రామానికి చెందిన అపూర్వను మళ్లీ తీర్థం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతిలో చేర్పించినట్లు సీఆర్పీ షాబుద్దీన్ తెలిపారు. బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి చదువు ప్రాముఖ్యత, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల పై వివరించి బాలికను పాఠశాలలో చేర్పించినట్లు చెప్పారు. డ్రాపౌట్ బాలిక మళ్లీ పాఠశాలకు వచ్చేవిధంగా కృషిచేసిన సీఆర్పీని ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి అభినందించారు.

చింతకుప్పంలో నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠ



రామకుప్పం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం చింతకుప్పంలో బుధవారం నాగదేవత విగ్రహాలను ప్రతిష్ఠించారు. రామకుప్పం పట్టణానికి చెందిన అరుణామెస్ నాగరాజు కుటుంబ సభ్యుల సహకారంతో గ్రామస్తులు వేద పండితులచే గణేష్, నవగ్రహ, శాంతి హోమాలు నిర్వహించారు. అనంతరం నాగదేవత విగ్రహాల ప్రాణప్రతిష్ఠ, ప్రత్యేక అభిషేక పూజలు చేపట్టారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

రెండు రోజుల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం



89 పెద్దూరులో స్థానికులతో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం 89 పెద్దూరు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఏళ్లగా స్థానికులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను టీడీపీ మండల నేతలు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన అక్కడ తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించడంతో పదిహేను రోజుల క్రితం గ్రామంలో కొత్త బోరు తవ్వారు. అయితే బోరుకు విద్యుత్ సరఫరా ఇవ్వడంలో జాప్యంతో తాగునీటి సమస్య అలాగే ఉందని బుధవారం గ్రామాన్ని సందర్శించిన ఆనందరెడ్డికి గ్రామస్తులు తెలిపారు. ఆయన ఈ విషయమై ఫోన్‌లో రెస్కో అధికారులతో మాట్లాడారు. వెంటనే బోరుకు విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. అనంతరం ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ రెండు రోజుల్లో కొత్త బోరు నుంచి తాగునీటి సరఫరా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఘనంగా కామిదొడ్డి గంగమాంబ ఆలయ కుంభాభిషేకం



గంగమ్మ, మారెమ్మ విగ్రహాలు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దచెల్లార గుంట పంచాయతీ పరిధిలోని కామిదొడ్డి గంగమాంబ ఆలయ కుంభాభిషేకం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో నూతనంగా గంగమ్మ, మారెమ్మ విగ్రహాలను ప్రతిష్ఠింపజేసి పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పలువురు భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

పుంగనూరు పార్కుకు సిందూర్ పేరు పెట్టాలి



పార్కు వద్ద సమావేశమైన మాజీ సైనికులు, ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్టు ప్రతినిధులు

పుంగనూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం పోరాడిన సైనికుల త్యాగానికి గుర్తింపుగా పుంగనూరు మున్సిపల్ పార్కుకు ఆపరేషన్ సిందూర్‌గా పేరుపెట్టాలని ఏపీజే అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పి.ఆయూబ్‌ఖాన్, మాజీ సైనికులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పుంగమ్మ చెరువు కట్టపై ఏర్పాటు చేసిన పార్కు వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సైనికులందరినీ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. త్వరలోనే సింధూర్ పార్కుగా పేరు పెట్టాలని కోరుతూ మాజీ సైనికులు, పట్టణ ప్రముఖులతో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిల్‌కు వినతి చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది తోట గిరి, ట్రస్ట్ సభ్యులు నరసింహులు, కృపాకర్, నాగరాజ, అమరనారాయణ, మాజీ సైనికులు మాజీసైనికులు నానబాల గణేశ్, మణి, కృష్ణప్ప, హరి మొదలియార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే యువతకు ఉపాధి అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పుంగనూరు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్ర జ్యోతి): యువత ప్రదర్శించే నైపుణ్యతతోనే కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఽ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం స్థానిక కాలేజీ ఆవరణలో పలు బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూల్లో 126 మంది విద్యార్థులు పాల్గొనగా.. 55 మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు ఆయన చెప్పారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారులు చైతన్య, లోకేశ్, పవన్‌కుమార్, వేణు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కుప్పం రోడ్డు విస్తరణలో కదలిక!

● ఎట్టకేలకు సర్వే ప్రారంభించిన అధికారులు



సర్వే చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు



విస్తరణ పరిధిలోకి వచ్చే నేతాజీ రోడ్డు 3వ రీచ్ భాగం

కుప్పం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మాటలతోనే ముగిసిపోతుందేమో అనుకుంటున్న వేళ కదలిక వచ్చింది. నేతాజీ రోడ్డు విస్తరణ పనుల్లో పురోగతి కనిపించింది. ఎట్టకేలకు బుధవారం ఇందుకోసం సర్వే ప్రారంభించడంతో విస్తరణ జరుగుతుందన్న కొంచెం నమ్మకం కుప్పం ప్రజలకు కలిగింది.

కుప్పంలో ప్రధాన రహదారి అయిన నేతాజీ రోడ్డు విస్తరణ పనులు ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్నాయి. 2014-2019లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నేతాజీ రోడ్డు విస్తరణ పనులను తలపెట్టింది. సౌలభ్యం కోసం రోడ్డును 3 రీచ్‌లుగా విభజించి ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేసింది. అప్పట్లో విస్తరణ పరిధిలోకి వచ్చే వ్యాపారులు, ఇతర వర్గాల నుంచి దీనిపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అయినా సరే వెరువకుండా ప్రభుత్వం ముందుకే వెళ్లింది. ప్రభుత్వ ధరలకంటే అధికంగా బాధితులకు నష్టపరిహారం చెల్లించడానికి ముందుకొచ్చి కొంతమందికి చెల్లించింది. కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నుంచి చెరువు కట్ట వరకు అధికంగా ప్రభుత్వ స్థలాలు, భవనాలు మాత్రమే ఉండటంతో అక్కడ విస్తరణ ప్రక్రియ ఎటువంటి ఆటంకం లేకుండా సాఫీగా జరిగిపోయింది. అయితే రెండవ రీచ్‌గా విభజించిన చెరువు కట్టనుంచి ఎమ్మార్ రెడ్డి కూడలి వరకు విస్తరణ పనులకు అడ్డంకులు చాలానే ఏర్పడ్డాయి. అప్పటి వైసీపీ నాయకుల ప్రోద్బలంతో కొంతమంది భవన యజమానులు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడంతో చాలాభాగం విస్తరణ పనులు ఆగిపోయాయి. మిగిలిన ప్రాంతాల్లో విస్తరణ పనులు జరిగినా అరకొరగా ఉండిపోయింది. మూడో రీచ్ అయిన ఎమ్మార్ రెడ్డి కూడలి నుంచి పాత కొత్తపేట రైల్వే గేటు వరకు విస్తరణ పనులు అస్సలు ముందుకు సాగలేదు. ఆయా భాగాల్లో ఉన్న వ్యాపారులను నాటి అధికార పార్టీ నాయకులే విస్తరణ పనులకు జరుగకుండా రెచ్చగొట్టారన్న విమర్శలు అప్పట్లో వినిపించాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో నేతాజీ రోడ్డు విస్తరణ పనులకోసం ప్రత్యేకంగా ఇచ్చిన జీవోను ఉపసంహరించుకుంది. దీంతో ఎక్కడి పనులక్కడ అసంపూర్తిగా ఆగిపోయాయి.

● విస్తరణ పనుల సర్వే మొదలు

ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉంది. స్థానిక ఎమ్మెల్యే అయిన చంద్రబాబునాయుడు ఎప్పటిలాగే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించారు. దీంతో అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ కుప్పం సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేస్తూ వచ్చారు. కుప్పం ప్రాంత అభివృద్ధి సంస్థ (కడా) ఏర్పాటుతో మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపుదాల్చింది. ఇందులో ప్రధానమైనది కుప్పం పట్టణంలోని ప్రధాన రహదారి అయిన నేతాజీ రోడ్డు విస్తరణ పనులు. దీంతో కడా పీడీ వికాస్ మర్మత్ మూడో రీచ్‌తోపాటు రెండో రీచ్‌లో మిగిలిన భాగం విస్తరణ పరిధిలోకి వచ్చే భవనాలు, స్థలాల యజమానులతో పలుమార్లు సమావేశమయ్యారు. అయితే విస్తరణ కోసం తీసుకుంటున్న భవనాలు, స్థలాలకు చెల్లించాల్సిన పరిహారం విషయంలో పెద్దగా రాజీ కుదరలేదు. ఎవరు అవునన్నా.. కాదన్నా విస్తరణ పనులు ఆగవని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతోనే ముందుకు వెళ్తున్నామని కడా పీడీ తెగేసి చెప్పడంతో పరిహారం విషయంలో బాధితులు కొంత మొండిపట్టు వదులుకున్నట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే నేతాజీ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించడానికి ముందు దాని పరిధిలోకి వచ్చే భవనాలు, స్థలాలను గుర్తించి మార్కింగ్ చేసే సర్వే ప్రక్రియ బుధవారం మొదలైంది. మూడో రీచ్ విస్తరణ పరిధిలో మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారులు సర్వే చేసి మార్కింగ్ వేశారు. ఈ సర్వే మొదలవడంతో నేతాజీ రోడ్డు విస్తరణ ఇక ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగబోదన్న స్పష్టమైన సందేశం పట్టణ ప్రజలకు అధికారులు ఇచ్చినట్లయింది.

సహకార సంఘాలతో రైతుల అభివృద్ధి

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



ముదరందొడ్డి పీఏసీఎస్ పాలకవర్గంచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

వి.కోట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను రైతులు సద్వినియోగం చేసుకోని అభివృద్ధి చెందాలని.. నూతన పాలకవర్గం రైతులకు సాయంగా రుణాలు అందించి సహకరించాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. బుధవారం వి.కోటలో సింగిల్ విండో కార్యవర్గాల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వి.కోట పీఏసీఎస్ అధ్యక్షులుగా పి.కొత్తూరుకు చెందిన నారాయణ స్వామి, డైరెక్టర్లుగా జయప్ప, ఎం.మూర్తిలచే పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రమాణం చేయించారు. ముదరందొడ్డి పీఏసీఎస్ అధ్యక్షులుగా హరినాథరెడ్డి, డైరెక్టర్లుగా రాధాకృష్ణ, చిన్నప్పగౌడుల చేతుల మీదుగా ప్రమాణం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందనేందుకు నూతనంగా ఎన్నికైన సింగిల్ విండో పాలకవర్గాలే నిదర్శనమన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపుగా అడుగులు వేస్తోందని తెలిపారు. బ్యాంకుల్లో రుణాలు పొందిన రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకుల ఉన్నతికి సహకరించాలన్నారు. ఆగస్టు 15 నాటికి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి రానుందన్నారు. రాష్ట్రంలో నాసిరకం మద్యంతో గత పాలకులు ప్రజల ఆరోగ్యాలతో ఆడుకున్నారని ఆరోపించారు. టీడీపీ మండలాధ్యక్షులు రంగనాథ్, జిల్లా అధికార ప్రతినిధులు రాంబాబు, చౌడప్ప, మాజీ వైస్ ఎంపీపీ గోపీనాథ్, మండల తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, మండల కార్యదర్శి ఈశ్వర్, నేతలు శబరీష్, చంద్రారెడ్డి, విశ్వనాథరెడ్డి, ఓబుల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సోము, రామ్మూర్తి, నాసీర్, రుహుల్లా, జనార్దన్‌రెడ్డి, కేశవరెడ్డి, వెంకట్రామప్ప, రాము, ముకుంద, సతీస్, అమరా, గౌస్‌పీర్, ఇక్బాల్ పాల్గొన్నారు.

డీఎస్పీ, ఆర్డీవో కార్యాలయ నిర్మాణాలకు భూమి పూజ



పాత మార్కెట్ భవనం కూల్చివేత పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాల కోసం నిర్మించనున్న నూతన కార్యాలయ నిర్మాణాలకు బుధవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, కడా సలహా మండలి సభ్యుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌లు కొత్తపేటలోని వినాయక స్వామి ఆలయంలో భూమిపూజ చేశారు. అనంతరం ఈ భవనం నిర్మించనున్న ప్రాంతంలోని పాత మార్కెట్ కట్టడాలను తొలగించే పనులు మొదలయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల మాట్లాడుతూ ఇప్పటికే కడా కార్యాలయ భవనాన్ని నిర్మించి అందులోనే సకల ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేశామని చెప్పారు. డివిజనల్ స్థాయి ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయ భవనాలను కొత్తపేటలో సాధ్యమైనంత త్వరలోనే నిర్మించి అందులోకి ఆయా కార్యాలయాలను మారుస్తామన్నారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత దగ్గర చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, పలువురు టీడీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఉద్యోగ సమస్యలపై చర్చిస్తున్న ఏపీజీఈఏ సంఘ నాయకులు

పుంగనూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేయనున్నట్లు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ పుంగనూరు తాలుకా అసోసియేట్ అధ్యక్షుడు నాగేనాయక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో జరిగిన ఏపీజీఈఏ సంఘ సభ్యులు, వైద్యులతో జరిగిన 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు, పీఆర్సీ సరెండర్ లీవు జీతాలు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు అందాల్సిన బకాయిలు, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనే డిమాండ్లపై పోరాటం చేస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వంలో రూ.11 వేల కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.7500 కోట్లు చెల్లించడంపై హర్షం వ్యక్తం చేశారు. మిగిలిన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్యదర్శి మధుబాల, పలువురు డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దారులను మూసేశారు!



ముళ్లకంపలు అడ్డంగా వేసి మూసేసిన దారి

రామకుప్పం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పంద్యాలమడుగు పంచాయతీ చిన్నబల్దారు గ్రామంలో శ్మశానం, పొలాలకు వెళ్లే దారులను కొందరు దౌర్జన్యంగా మూసివేశారు. గ్రామస్తుల కథనం మేరకు.. చిన్నబల్దారు గ్రామానికి చెందిన సుమారు 70 కుటుంబాల వారు తరతరాలుగా శ్మశానానికి, తమ పొలాలకు వెళ్లేందుకు 15 అడుగుల చొప్పున రెండుదారులను వినియోగించుకుంటున్నారు. బుధవారం గ్రామానికి చెందిన కమలమ్మ, సరసమ్మ, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, హేమంత్‌రెడ్డి ఆ రెండు దారులను ముళ్లకంపలు వేసి మూసివేశారు. అంతేకాకుండా ఆ దారుల్లో వెళ్తున్న రైతులను అడ్డుకున్నారు. ప్రశ్నించిన వారిపై దురుసుగా ప్రవర్తించారు. ఈ విషయమై గ్రామస్తులు మండల తహసీల్దారు, రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుమారస్వామి మృతి తీరనిలోటు

గుడుపల్లె, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయం ఆంగ్ల శాఖ అభివృద్ధికి కుమారస్వామి విశేష కృషి చేశారని, ఆయన మృతి సాహిత్య లోకానికి తీరని లోటు అని ఆచార్య తిరుపతి రావు పేర్కొన్నారు. బుధవారం ద్రావిడ వర్సిటీలో పనిచేసిన ఆంగ్ల శాఖలో ఆచార్యులుగా పనిచేసిన కుమారస్వామి ఈనెల 5న మృతి చెందారు. ఆయన మృతికి సంతాపంగా భాషా భవనం సెమినార్ హాల్‌లో ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. కుమారస్వామి చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

మేజర్ డ్రైన్లను పరిశీలించిన కమిషనర్



చిత్తూరు అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలో ఉన్న మేజర్ మురుగునీటి కాలువలను కమిషనర్ నరసింహప్రసాద్ పరిశీలించారు. బుధవారం ఆయన ఎంఎస్ఆర్ సర్కిల్, వినాయక పురం, కట్టమంచి, దర్గా సర్కిల్ ప్రాంతాల్లో ఉన్న మేజర్ మురుగునీటి కాలువలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా ఎంఎస్ఆర్ సర్కిల్ వద్ద ఉన్న డ్రైన్ భారీ వర్షాలు వచ్చినప్పుడు పొంగి రోడ్డుపైకి మురుగునీరు వస్తోందని, అలా రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దర్గా సర్కిల్ నుంచి వస్తున్న మేజర్ డ్రైన్ నుంచి నీటిని మళ్లించడానికి అదనపు కల్వర్టు నిర్మాణాన్ని పరిశీలించాలన్నారు. డ్రైన్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచడమే కాకుండా నీటి ప్రవాహాలకు అడ్డులేకుండా చూడాలన్నారు. కమిషనర్‌తో పాటు ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, డీఈ శ్రావణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

జ్వరాలపట్ల అప్రమత్తంగా ఉండండి

చిత్తూరు సిటీ, ఆగస్టు 6: జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిత్తూరు అర్బన్ హెల్త్ సబ్‌యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ సూచించారు. బుధవారం నగరపాలక సంస్థ పరిధిలోని టి.చవటపల్లి, తిమ్మసముద్రం, ఇందిరమ్మ కాలనీ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటువల్ల మలేరియా, డెంగీ, చికున్ గున్యా, బోదకాలు, మెదడువాపు వచ్చే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ఇంటి ఆవరణలో నీరు ఎక్కువ రోజులు నీరు నిలువలేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. అనంతరం ఫాగింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దిలీప్‌కుమార్, సీహో గోపి, మున్సిపల్ ఫీల్డ్ అసిస్టెంట్ మురళి కృష్ణ, ఏఎన్ఎం హేమలత, ఆషా కార్యకర్తలు మమత, శశికల తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు రద్దు ఉత్తర్వులను ఉపసంహరించాలి

చిత్తూరు రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎఫ్‌పీఈ పోస్టల్ ఉద్యోగుల సంఘం గుర్తింపు రద్దు ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సర్దార్, మహదేవన్, హరిప్రసాద్, చిన్నబ్బ పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంఈవో

గుడిపాల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరహరిపేట జడ్పీ హైస్కూల్‌ను బుధవారం ఎంఈవో గణపతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లును పరిశీలించారు. పిల్లల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దుర్వాసులు, సహిత కో-ఆర్డినేటర్ మధు, పాల్ ల్యాబ్ నోడల్ ఆఫీసర్ చాంద్‌బాషా, సీఆర్ఎంపీలు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడం అన్యాయం



కాణిపాకం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీ తాగుతూ మాట్లాడుతున్న ఉద్యోగులు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చక పోవడం అన్యాయం అని ఏపీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య అన్నారు. బుధవారం కాణిపాక ఆరోగ్యకేంద్రంలోని ఉద్యోగులతో కలసి 'రండి టీ తాగుతూ మాట్లాడుదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 25 వేల కోట్లు ఉద్యోగులకు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అంత పెద్ద మొత్తంలో బకాయిలు చెల్లించే స్థితిలో లేనందున ప్రభుత్వ స్థలాలను ఇళ్ల స్థలాలుగా మార్చి కేటాయించాలని కోరారు.

సింగిల్‌విండో అధ్యక్షుడిగా మోహన్‌నాయుడు

● కమిటీ మెంబర్లుగా జ్యోతియాదవ్, ఇమ్మానువేల్



మోహన్‌నాయుడు, జ్యోతియాదవ్, ఇమ్మానువేల్

గంగాధర నెల్లూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల సింగిల్ విండో సొసైటీ త్రీమెన్ కమిటీ అధ్యక్షుడుగా ఎల్లాపల్లె గ్రామానికి చెందిన పార్లమెంట్ తెలుగురైతు అధికార ప్రతినిధి ముప్పిరి మోహన్‌నాయుడు నియమితులయ్యారు. మెంబర్లుగా వరత్తూరు పంచాయతీ నరాల కండిగ గ్రామానికి చెందిన మండల టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు బుర్రా జ్యోతియాదవ్, ముక్కళత్తూరు పంచాయతీ మిట్టదళితవాడకు చెందిన మాజీ ఉపసర్పంచ్ ఇమ్మానువేల్ (చిన్నా)ను ఎంపిక చేశారు.

ఎస్ఆర్‌పురం సింగిల్ విండో అధ్యక్షుడిగా నిరంజన్‌రెడ్డి



శ్రీరంగరాజపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం సింగిల్ విండో సొసైటీ అధ్యక్షుడిగా ఎల్లంపల్లి గ్రామానికి చెందిన నిరంజన్ కుమార్‌రెడ్డి నియమితు లయ్యారు. కమిటీ మెంబర్లుగా మూల్లూరు గ్రామానికి చెందిన డి.హేమాద్రి యాదవ్, పెద్ద తయ్యూరు చెందిన నాగరాజు నియమితులయ్యారు.

15, 16 ఆడికృత్తిక

చిత్తూరు కల్చరల్: గిరంపేట శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 15న ఆడి భరణి నక్షత్ర పూజలు, 16న ఆడికృత్తిక పూజలు నిర్వహిస్తున్నట్లు ఈవో వెంకట సుబ్బారెడ్డి తెలియజేశారు. అదేవిధంగా కామాక్షి అంబికా సమేత అగస్తీశ్వర, బజారు వీధి శివ షణ్ముగ సుందర వినాయక ఆలయాల్లో 15, 16 తేదీల్లో ఆడి కృత్తిక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో వెంకటరాయలు తెలియజేశారు,

నాణ్యమైన భోజనం అందించాలి

పెనుమూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాలదేవి పేర్కొన్నారు. బుధవారం ఆమె పెనుమూరు మండలంలో పర్యటించారు. పెనుమూరు, ఉగ్రాణంపల్లి జడ్పీ హైస్కూల్, ఎంపీపీ స్కూల్, అంగన్వాడీలను తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిక్షించారు. గుడ్లు, చిక్కీలు వంటి వాటిని పరిశీలించి నాణ్యతలేని సరుకులు తీసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్‌నాయుడు, హెచ్ఎం లత, రమేష్, ఉపాధ్యాయులు యామిని పాల్గొన్నారు.

రేపు కాణిపాకానికి హైకోర్టు జడ్జి రాక

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి వి.గోపాలకృష్ణారావు శుక్రవారం జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన శుక్రవారం ఉదయం 10 గంటలకు కుటుంబ సమేతంగా కాణిపాకం విచ్చేసి వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకుంటారు. దర్శనానంతరం ఆలయ అతిథిగృహంలో విశ్రాంతి తీసుకుంటారు. ఉదయం 11.30 గంటలకు తిరుచానూరుకు బయలుదేరి వెళ్తారని తెలిపారు.

ఉభయదారుల విషయంలో ఎమ్మెల్యే జోక్యం తగదు

చిత్తూరు సిటీ, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): ఉభయదారుల విషయంలో ఎమ్మెల్యే జోక్యం తదగని కాణిపాకానికి చెందిన విజయ్ పేర్కొరు. బుధవారం చిత్తూరు ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాణిపాక వరసిద్ధి ఆలయం నిర్మించినప్పటి నుంచి ఇప్పటి వరకు వినాయకస్వామి బ్రహ్మోత్స వాల్లో పరిసర ప్రాంతాల్లోని 14 గ్రామాలకు చెందిన దళిత ఉభయదారులు చంద్ర ప్రభ వాహన సేవ నిర్వహించేవారని చెప్పారు. ఈ ఏడాది ఎమ్మెల్యే మురళీమోహన్ తన బంధువర్గం ఉన్న కాణిపాకపట్నం, పైపల్లె, సిద్ధంపల్లె గ్రామాలకు చెందిన దళితులను ఉభయదారులుగా చేర్చడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. అదేజరిగితే ఆలయం ఎదుట 14 గ్రామాల దళితులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఉభయదారులు మూర్తి, గిరి, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మైక్‌సెట్ వితరణ

విజయపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీహరిపురం ఆదర్శ పాఠశాలకు బుధవారం విశ్రాంత ఉపాధ్యాయుడు హిమాచలం మైక్‌సెట్ వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకమరాజు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

వెదురుకుప్పం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తిరుమలయ్యపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రిని పచ్చికాపల్లం జడ్పీ ఉన్నత కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ సిద్దయ్య అందజేశారు. పెన్నులు, పెన్సిళ్లు, నోటుపుస్తకాలు తదితర వాటిని ఆ పాఠశాల హెచ్ఎం చాముండేశ్వరికి అందించారు.

డేటాను ఆన్‌లైన్ చేయం : సీఐటీయూ

వెదురుకుప్పం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించేవరకు గురువారం నుంచి ఏ డేటాను తాము ఆన్‌లైన్ చేయబోమని, రికార్డుపరంగానే రాస్తామని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి మమత వెల్లడించారు. బుధవారం కార్వేటినగరం ఐసీడీఎస్ కార్యాల యానికి ఆ ప్రాజెక్టు పరిధిలో 201 అంగన్వాడీ కేంద్రాల నుంచి ఆఫీసు తరపున ఇచ్చిన మొబైల్స్‌ని ఆ యూనియన్ నాయకులతో కలసి తీసుకొచ్చారు. సీడీపీవో, సూపర్‌వైజర్లు అందుబాటులో లేకపోవడంతో ఫోన్లను ఓ అట్టపెట్టెలో ఉంచి ఆఫీసులో ఉంచామని వెల్లడించారు. సమస్యలు పరిష్కరించేవరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ప్రత్యేక గ్రీవెన్స్‌కు ఆరు ఫిర్యాదులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 6, (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల కోసం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ డేలో 6 అర్జీలు వచ్చాయని ఏఈ టెక్నికల్ మాధురి తెలిపారు. బుధవారం స్థానిక గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో విద్యుత్తు శాఖ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఏఈ మాధురి అర్జీలు స్వీకరించారు. అప్పటికప్పుడే నాలుగు అర్జీలను పరిష్కరించామని, మిగిలిన రెండిటిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

హామీలను గుర్తు చేస్తూ క్యూ ఆర్ కోడ్ విడుదల

చిత్తూరు అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ బుధవారం నగరంలోని 43వ డివిజన్‌లోని రాములగుడివీధిలో చిత్తూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ నగర అధ్యక్షులు కేపీ శ్రీధర్, ఉపాధ్యక్షులు నౌషద్, నాయకులు గాయత్రిదేవి, హరీషారెడ్డి, కార్పొరేటర్ చల్లముత్తు పాల్గొన్నారు.

అప్పుడు నరకం..ఇప్పుడు స్వర్గం

బాగుపడిన ఐరాల-కాణిపాకం ప్రధాన రహదారి





గుంతలమయంగా ఉండి రోడ్డుపై నిలిచిన వర్షపునీరు - బీటీ రోడ్డు వేయడంతో ప్రయాణానికి అనుకూలంగా ఉన్న రోడ్డు

ఐరాల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఐరాల-కాణిపాకం ప్రధాన రహదారి గత ప్రభుత్వ హయాంలో గుంతలమయమై ప్రయాణానికి తీవ్ర ఇబ్బందిగా ఉండేది. రెండు రోజుల క్రితం వరకు ఈ మార్గం ప్రయాణికులకు నరకప్రాయం. వర్షం కురిసిందంటే వీఎస్.అగ్రహారంలో రోడ్డులో వర్షపు నీరు చేరి గుంతతెలియక చాలామంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదం బారిన పడ్డారు. ఈ మార్గం ద్వారా పాఠశాల, జూనియర్ కళాశాలకు వెళ్లే విద్యార్థులు నిత్యం అవస్థలు పడేవారు. వాహనాల్లో తీవ్ర కుదుపులతో ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఈ మార్గంలో బీటీ రోడ్డు వేసి గుంతను పూర్తిగా పూడ్చి వేయడంతో ప్రయాణం సాఫీగా సాగుతోంది.

నిరుపేదలను ఆదుకోవడానికే సీఎం సహాయనిధి



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నగరి/ నింద్ర/ విజయపురం, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబాలను ఆదుకోవడానికే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే గాలి.భానుప్రకాష్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే భానుప్రకాష్ లబ్దిదారులకు పంపిణీ చేశారు. నగరి మున్సిపాలిటీకి చెందిన పీ.వీ.మురుగన్‌కు రూ.2,21,192, పుత్తూరు మండలానికి చెందిన యశ్వంత్‌కృష్ణకు రూ1,50,158, విజయపురం మండలం ఆలపాకంకు చెందిన ఢిల్లీబబాబుకు 43,400, నింద్ర మండలం ఐఆర్.కండ్రిగకు చెందిన నాగమ్మకు 1,89,078, పుత్తూరు మున్సిపాలిటీ ఆరేటమ్మ కాలనీకి చెందిన గురుస్వామి కుటుంబానికి రూ.12,000, పంపిణీ చేశారు. మొత్తం ఐదుగురికి కలిపి రూ6,15,828ల చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే నివాళి

నగరి: మండల పరిధిలోని వేలావడి దళితవాడకు చెందిన టీడీపీ నాయకుడు వినోద్‌కుమార్ తండ్రి రాజేంద్రన్ చిత్రపటానికి ఎమ్మెల్యే భానుప్రకాష్ నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో నగరి టీడీపీ మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బాలాజీ, పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

పడవేటమ్మ సేవలో ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేవీపురంలో బుధవారం నిర్వహించిన పడవటమ్మ తిరుణాళ్లలో నగరి ఎమ్మెల్యే గాలి భాపనుప్రకాష్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, మాజీ ఎంపీపీ రాజేశ్వరివేణుగోపాల్‌నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని ఆలపాకంలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్త డిల్లీబాబుకు సీఎం సహాయ నిధి కింద రూ.43,300లు చెక్కు పంపిణీ చేశారు.

టీడీపీ నాయకుడికి నివాళి

మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌లో ఇటీవల మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చంద్రయ్య చిత్రపటానికి పూల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుణభూషణమ్మ, ధనరాజ్, బెంజిమన్, శివలింగం, పరంధామనాయుడు పాల్గొన్నారు.

వేగంగా సాగుతున్న హైరోడ్డు విస్తరణ పనులు



పనులను పరిశీలిస్తున్న ఏసీపీ నాగేంద్ర

చిత్తూరు అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని హైరోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. నెల రోజులుగా కట్టమంచి వెంకుశ కళ్యాణ మండపం నుంచి ప్రారంభించిన వంద అడుగుల రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ముందుగానే ప్రభుత్వ స్థలం, మసీదు, ఎండోమెంట్ స్థలాల్లో వంద అడుగుల వరకు ఎక్సవేటర్ల సాయంతో తొలగించారు. ప్రస్తుతం ప్రైవేటు యజమానులను ఒప్పించి రోడ్డుకు అవసరమైన వంద అడుగుల స్థలాన్ని సేకరిస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం కట్టమంచి వద్ద ఉన్న ఓ భవన యజమానిని ఒప్పించి వంద అడుగులకు ఎంత అవసరమో అంత వరకు తీసుకున్నారు. అనంతరం ఏసీపీ నాగేంద్ర ఆధ్వర్యంలో సేకరించిన స్థలంలో అడ్డుగా ఉన్న వాటిని ఎక్సకవేటర్ సాయంతో తొలగించారు.

సమష్టిగా పనిచేయాలి : డీఐఈవో



డీఐఈవో రఘుపతిని సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేసి ప్రభుత్వ జూనియర్ కళాశాలల స్థాయిని పెంచాలని డీఐఈవో రఘుపతి సూచించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ నాయకులు బుధవారం డీఐఈవోను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. డీఐఈవోను సత్కరించిన వారిలో సంఘం జనరల్ సెక్రటరీ సెబాస్టియన్, ట్రెజరర్ మునిచంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రమౌళి, డీఐఈవో కార్యాలయ సూపరింటెండెంట్ హరికృష్ణ, సీనియర్ అసిస్టెంట్ నజీర్, చరణ్, మునిరత్నం, శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

తేలని జీడీ నెల్లూరు టీడీపీ మండలాధ్యక్ష పదవుల పంచాయితీ

చిత్తూరు సిటీ/ పాలసముద్రం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని టీడీపీ మండల అధ్యక్ష పదవుల నియామకం ఒక కొలిక్కి రాలేదు. స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ కార్యాలయంలో బుధవారం కూడా పార్టీ నేతలతో చర్చలు జరిగాయి. నియోజకవర్గంలోని పెనుమూరు మండలాధ్యక్షుడుగా రుద్రయ్యనాయుడు, కార్వేటినగరం మండలాధ్యక్షుడుగా చెంగల్రాయ మందడి పేర్లు దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. కాగా గంగాధరనెల్లూరు, ఎస్ఆర్ పురం, పాలసముద్రం, వెదురుకుప్పం మండలాల అధ్యక్ష పదవులకు పోటీపడే నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఈ మండలాలకు అధ్యక్ష పదవులు అధిష్టానం నిర్ణయం మేరకు ప్రకటించ నున్నట్లు పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్ చెప్పారు. మంగళవారం ఎమ్మెల్యే థామస్, నియోజకవర్గ పరిశీలకులు బొమ్మి సురేంద్ర, రమణారెడ్డి, గురవారెడ్డి, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ సమక్షంలో మండలాల వారీగా పదవిని ఆశించే నేతలను పిలిచి వారి అభిప్రాయాలను సేకరించిన విషయం తెలిసిందే. జీడీ నెల్లూరు మండలాధ్యక్ష పదవి కోసం దేవసుందరం, స్వామిదాస్, వెదురుకుప్పం మండలానికి కిషన్ చందు, మోహన మురళి, ఎస్ఆర్ పురం మండలానికి జయశంకర నాయుడు, వేమననాయుడు, పైనేని మురళి, పాలసముద్రం మండలానికి పాలూరు శివ, వాసు నాయుడు పోటీలో ఉన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ల నియామకం



చవటగుంట పీఏసీఎస్ చైర్మన్ సుధాకరరెడ్డి, డైరెక్టర్లు రవి, మనోహర్‌నాయుడు

వెదురుకుప్పం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం చవటగుంట పీఏసీఎస్ చైర్మన్‌గా ఆళ్లమడుగుకు చెందిన తెలుగు యువత జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బోడిరెడ్డి సుధాకరరెడ్డి నియమితులయ్యారు. ఈ పీఏసీఎస్‌కు డైరెక్టర్లుగా వేణుగోపాలపురం కాలనీకి చెందిన ఎస్సీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బీఎం రవి, రెడ్డిపల్లికి చెందిన తెలుగు యువత నాయకుడు పి.మనోహర్ నాయుడు నియమితులయ్యారు.

కార్వేటినగరం పీఏసీఎస్ చైర్మన్‌గా జనార్దన్‌రాజు



కార్వేటినగరం పీఏసీఎస్ చైర్మన్ జనార్ధన్‌రాజు, డైరెక్టర్లు చెంగల్రాయులు, జయచంద్రన్

కార్వేటినగరం పీఏసీఎస్ చైర్మన్‌గా కృష్ణాపురానికి చెందిన మాజీ ఎంపీపీ మాదిరాజు జనార్ధన్‌రాజు నియమితులయ్యారు. డైరెక్టర్లుగా ఆర్కేవీబీపేటకు చెందిన ఎస్సీ సెల్ మండల ప్రధానకార్యదర్శి చంద్రగిరి చెంగల్రాయులు, కొల్లాగుంటకు చెందిన ఆర్.జయచంద్రన్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పాలసముద్రం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కార్వేటినగరం ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి పేర్కొన్నారు. బుధవారం పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, వృత్తి పరమైన మార్గదర్శి, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. నాయకత్వ లక్షణాలను కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హేమలత, సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్, జిల్లా యువజన అధికారి ప్రదీప్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రీరామ రక్ష

పాలసముద్రం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని అంగన్వాడీ సిబ్బంది పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బుధవారం మండలంలోని పాలసముద్రం కాలనీలో అంగన్వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది రాధమ్మ, జీవిత, కవిత, విజయ పాల్గొన్నారు.

ఎక్సకవేటర్ సీజ్

పూతలపట్టు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న ఓ ఎక్సకవేటర్‌ను పూతలపట్టు రెవిన్యూ అధికారులు బుధవారం సీజ్‌చేశారు. మండలంలోని పి.కొత్తకోట పంచాయతీ టీకేపల్లి గ్రామ సమీపాన గల అడ్డగుట్ట వద్ద కొంత ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలాన్ని రామమూర్తి అనే వ్యక్తి మరొకరితో కలిసి చదునుచేస్తుండగా గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు తహసీల్దార్ రమేష్ బాబు, రెవిన్యూ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఎక్సకవేటర్‌ను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు.

క్వారీ తనిఖీ

పూతలపట్టు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు క్వారీలను బుధవారం రెవెన్యూ, పోలీసులు, మైన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పోటుకనుమ గ్రామ సమీపాన గల ఓ క్వారీని తనిఖీ చేసి క్వారీ హద్దులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌బాబు, సీఐ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలు

వెదురుకుప్పం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని శిష్ట సౌందర్య వల్లి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రదోష కాలం పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు కోదండపాణి మొదలియార్ సహా నిర్వాహకులు పర్యవేక్షించారు.

● చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి, నందీశ్వర స్వామికి ప్రదోష పూజలు ఏకకాలంలో చేశారు. ప్రధాన అర్చకులు రవిశర్మ విశేష పూజలను చేశారు. ఏర్పా ట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

13న వారపు సంత వేలం

వెదురుకుప్పం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం వారపు సంత, వాణిజ్యపు సముదాయం గదులకు ఈ నెల 13వ తేదిన ఉదయం 11 గంటలకు వెదురుకుప్పం గ్రామ సచివాలయం వద్ద బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో కోదండరెడ్డి బుధవారం తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

యాదమరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గత రాత్రి కురిసిన భారీవర్షాలకు మురుగునీరు పొంగిపొర్లడంతో నిరాశ్రయులైన 14 కండ్రిగ గ్రామంలోని షానూర్ కుటుంబానికి రెవెన్యూ అధికారులు అండగా నిలిచారు. నిత్యావసర వస్తువులను, వంటసామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు కుమార్, సురేష్ బాబు పాల్గొన్నారు.

ఉచితంగా కుట్టు మిషన్లు ఇస్తాం: డీఆర్‌డీఏ పీడీ



పాలశీతలీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చిత్తూరు, విజయనగరం డీఆర్డీఏ పీడీలు శ్రీదేవి, శ్రీనివాసులు

యాదమరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు ఇస్తామని డీఆర్డీఏ పీడీ శ్రీదేవి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వెలుగు సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు టైలరింగ్‌పై అందిస్తున్న శిక్షణను ఆమె పరిశీలించారు. శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. అదేభవనంలో డ్వాక్రా మహిళలు నిర్వహిస్తున్న పాలశీతలీ కరణ కేంద్రం నిర్వహణ గురించి విజయనగరం జిల్లా డీఆర్డీఏ పీడీ శ్రీనివాసులుకు వివరించారు. డీపీఎంలు మధు, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి వల్లేరు అమర్‌నాథనాయుడు, ఏపీఎం ఈశ్వరి, హేమ, ప్రసాద్, సీసీలు లక్ష్మీపతి, మల్లీశ్వరి, మంజుల పాల్గొన్నారు.